క్లుప్తంగా

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



విద్యుత్‌స్తంభంపై విరిగిపోయిన క్రాస్‌ఆర్మ్

కాజులూరు: గొల్లపాలెం ఆదిమూలల కాలనీలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. స్తంభంపై విరిగిపోయిన క్రాస్‌ఆర్మ్‌ను ట్రాన్స్‌కో సిబ్బంది వెంటనే మార్పు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఆదివారం గ్రామంలో స్థానిక పంచాయతీ పాలకవర్గ సభ్యుడు రేఖపల్లి సత్యనందం తదితరులు విలేకరులతో మాట్లాడుతూ గత కొన్నాళ్లుగా విద్యుత్ స్తంభంపై క్రాస్‌ఆర్మ్ తుప్పు పట్టి ఉండడంతో అది ఏ క్షణమైనా విరిగిపోయే అవకాశం ఉందని దానిని మార్చాలని ట్రాన్స్‌కో సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. గత నాలుగు రోజుల క్రితం ఈదురు గాలులతో కూడిన వర్షానికి క్రాస్‌ఆర్మ్ విరిగిపోయిందని అది పూర్తిగా ఊడి కింద పడితే ఘోర ప్రమాదం సంభవిస్తుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే క్రాస్‌ఆర్మ్ మార్పు చేయాలన్నారు.

రహదారి నిర్మాణ పనులకు భూమిపూజ

రాయవరం: మండలంలోని సోమేశ్వరం–మాచవరం గ్రామ సరిహద్దుగా ఉన్న సూర్యలక్ష్మి థియేటర్ రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదివారం భూమిపూజ చేశారు. రూ.20 లక్షల జెడ్పీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులను చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఆరిఫ్, కత్తుల సీతామహాలక్ష్మి, ఉప సర్పంచ్ పడాల వసంత్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, వైస్ ఎంపీపీ కొవ్వూరి అమ్మిరెడ్డి, ఎంపీటీసీలు కాళ్ల అప్పారావు, పలివెల శోభన, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, పారిశ్రామికవేత్త సబ్బెళ్ల కాశీఈశ్వర రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

31 వరకూ సెక్షన్ 30 అమలు

రామచంద్రపురం: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా స్థానిక సబ్ డివిజన్ పరిధిలో ఈనెల 31వతేదీ వరకూ సెక్షన్ 30 ప్రకారం నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న ప్రాంతాల్లో ఈనెల ఒకటో తేదీ నుంచి 31 వరకూ సెక్షన్ 30 పోలీస్ యాక్టు ప్రకారం ముందస్తు అనుమతి లేకుండా సమావేశాలు, ఊరేగింపులు వంటివి చేయకూడదన్నారు. అటువంటివి జరపాలంటే సబ్ డివిజన్ పోలీస్ అధికారి వద్ద ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పేదలకు ఆహారం అందజేత



ఆహార ప్యాకెట్లు అందజేస్తున్న దాలయ్య తదితరులు

మండపేట: నిరుపేదల ఆకలిని తీర్చేందుకు పట్టణంలోని గొల్లపుంత కాలనీకి చెందిన శ్రీమోక్ష సంస్థ చేస్తున్న కృషి ప్రశంసనీయమని వైఎస్సార్ సీపీ నేత ముక్కా దాలయ్య అన్నారు. కాలనీలో ఆదివారం సంస్థకు చెందిన యువకుల ఆధ్వర్యంలో ఆహార ప్యాకెట్ల పంపిణీని దాలయ్య ప్రారంభించారు. వంద మందికి పైగా పేదలకు సంస్థ సభ్యులు ఆహార ప్యాకెట్లు, డ్రింక్ బాటిళ్లను అందజేశారు. సంస్థ సభ్యులు ఎగ్గాడి లోవరాజు, కర్రి వెంకటరమణ, ప్రసాద్, మందపల్లి సూరిబాబు, తాతపూడి సందీప్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ద్రాక్షారామలో ఉచిత దంత వైద్య శిబిరం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో డాక్టర్ బచ్చు క్రాంతి కిరణ్ నేతృత్వంలో భీమేశ్వర దంత వైద్యశాల 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆదివారం విలేకరులకు తెలిపారు. దంత సమస్యలను గుర్తించి ఉచితంగా మందులు, టూత్ పేస్టులు అందిచడంతో పాటు బీపీ, షుగర్, సీబీపీ, థైరాయిడ్, లిపిడ్ ప్రొఫైల్, మూత్ర పరీక్షలు, ప్లేట్‌లెట్ కౌంట్, కొలెస్ట్రాల్, బ్లడ్ గ్రూప్ తదితర రక్త పరీక్షలు చేస్తామని డాక్టర్ క్రాంతికుమార్ తెలిపారు. ద్రాక్షారామ, పరిసర గ్రామాల ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పార్టీ బలోపేతానికి పాటుపడాలి

మండపేట: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ మండపేట మండల సేవాదళ్ కన్వీనర్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పోతుల రాంబాబుకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సూచించారు. సేవాదళ్ మండల కన్వీనర్‌గా నియమితులైన సందర్భంగా ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ తోటను రాంబాబు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట నేతృత్వంలో మండలంలో పార్టీ కార్యక్రమాల విజయవంతానికి శక్తి వంచన లేకుండా పాటుపడతానన్నారు. పార్టీ నాయకులు పోతుల సుబ్రహ్మణ్యం, పోతుల దుర్గాప్రసాద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్య విని.. వెతలు తీర్చి..

- పుంత రోడ్ల అభివృద్ధిపై కేశవరం రైతుల హర్షం
- ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు
- ఎమ్మెల్యే వేగుళ్ల అక్రమ తవ్వకాలతో పెట్రోవర్సిటీ పోయిందని ఎమ్మెల్సీ మండిపాటు



ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలుపుతున్న రైతులు

మండపేట: ఈ రోడ్లకు జడిసి మధ్యాహ్నం క్యారేజీ తెచ్చుకోవడానికి చేలోంచి ఇంటికి వెళ్లే వాళ్లం కాదు. పొలంలోకి పిండి బస్తా తేవాలన్నా, పండిన ధాన్యాన్ని తరలించాలన్నా నానా తంటాలు పడేవాళ్లం. గ్రావెల్ రోడ్లు వేసి మా వెతలు తీర్చారు. సైకిల్ కూడా రాని రోడ్డుపైకి కార్లు వచ్చేలా చేసిన మీ మేలును మరువలేమంటూ కేశవరం రైతులు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు తీరిన వెతలు

కేశవరంలో కాలువ దిగువన ఎనిమిది కిలోమీటర్ల పొడవు కలిగిన నాగేడు పుంత, పెదకాలువ గట్టు, మంగలపాడు పుంత రోడ్ల పరిధిలో 1150 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. పెద్దపెద్ద గోతులతో ప్రమాదభరితంగా ఉన్న ఈ రోడ్లపై రాకపోకలు సాగించేందుకు రైతులు తీవ్ర అవస్థలు పడాల్సి వచ్చేది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దూలం పద్మ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకన్నబాబు దంపతులు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ రైతుల సమస్యను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించారు. ఆయన కృషితో రాజకీయాలకు అతీతంగా నాయకులు, రైతులు కలిసి గ్రావెల్‌తో పుంత రోడ్లను అభివృద్ధి చేయడంతో దశాబ్దాల కాలంగా స్థానిక రైతాంగాన్ని పట్టిపీడిస్తున్న పుంత రోడ్ల సమస్య పరిష్కారమైంది.

ఎమ్మెల్సీ తోట దృష్టికి తీసుకెళ్లడంతో..

పుంత రోడ్లను పరిశీలించేందుకు ఆదివారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్సీ తోటకు గ్రామ సర్పంచ్ పెదపాటి సత్యనారాయణమూర్తి, రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు రైతులు మాట్లాడుతూ పుంత రోడ్లను అభివృద్ధి చేయాలని దశాబ్దాల కాలంగా ఎంతో మంది వేడుకున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. సైకిళ్లపై తిరిగేందుకు ఇబ్బంది పడే తమ పుంతరోడ్లను కార్లు తిరిగేలా అభివృద్ధి చేశారని ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ అభివృద్ధిని అడ్డుకోవడం తప్ప ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు మరో పని లేదన్నారు. పుంత రోడ్లు పనులను అనుమతులు లేవని అడ్డుకోవాలని చూశారని మండిపడ్డారు. మండపేటలో లేఅవుట్ల కోసం గతంలో ఆయన చేసిన అక్రమ తవ్వకాల వలన ద్వారపూడికి మంజూరైన పెట్రో వర్సిటీ విశాఖకు తరలిపోయిందని విమర్శించారు. పనుల్లో అక్రమాలు జరుగుతుంటే కేశవరం, జెడ్ మేడపాడు గ్రామాల్లోని టీడీపీ నాయకులు ఎందుకు నోరు మెదపడం లేదని ఎమ్మెల్సీ తోట ప్రశ్నించారు. మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, ఎంపీటీసీ సభ్యులు అన్నందేవుల కృష్ణారావు, చంద్రమళ్ల పోతురాజు, పార్టీ నాయకులు సలాది శివన్నారాయణ, కొప్పిరెడ్డి ప్రసాద్, అద్దంకి రమణ, తుపాకుల ప్రసన్నకుమార్, అబ్బిరెడ్డి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తోట చొరవతో..



గ్రామాభివృద్ధికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఎంతో సహకరిస్తున్నారు. గ్రామంలో రూ.రెండు కోట్ల పనులకు ఇటీవల ఎమ్మెల్సీ తోట భూమిపూజ చేశారు. పుంత రోడ్ల అభివృద్ధితో రైతుల దీర్ఘకాలం నాటి వెతలు తీరాయి.

– పెదపాటి సత్యనారాయణమూర్తి, సర్పంచ్, కేశవరం

ఎమ్మెల్యే పట్టించుకోలేదు



ఎమ్మెల్యే వేగుళ్ల నీరుచెట్టు పథకం కింద చెరువుల్లో మట్టిని అక్రమ తరలించుకుపోయి తన లేఅవుట్లు కప్పెట్టుకున్నారే తప్ప కేశవరం గ్రామాభివృద్ధి పట్టించుకోలేదు. రైతుల సమస్య చెప్పగానే ఎమ్మెల్సీ తోట స్పందించి సమస్యను పరిష్కరించారు.

– వుండమట్ల పాపారావు, రైతు, కేశవరం

ప్రజల సహకారం ఎంతో అవసరం



ఎస్సై సురేష్‌బాబును సత్కరిస్తున్న ఏజీపీ మురళి తదితరులు

రామచంద్రపురం: విధి నిర్వహణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని రామచంద్రపురం పట్టణ ఎస్సై డి.సురేష్‌బాబు అన్నారు. ఇటీవల పట్టణంలో జరిగిన డిక్కీ దొంగతనం కేసును త్వరగా చేధించి బాధితులకు నగదును రికవరీ చేయడంతో జిల్లా ఎస్పీ ఎస్ శ్రీధర్ నుంచి నగదు రివార్డును ఎస్సై సురేష్‌బాబు అందుకున్నారు. ఈ మేరకు ఏజీపీ, బార్ అసోసియేషన్ చైర్మన్ పిల్లి మురళీమోహన వెంకటరమణ, న్యాయవాది పి.వెంకటరమణ, పట్టణ ఏపీఈపీడీసీఎల్ ఏఈ ఎం.వెంకటరమణ, భాస్కర్ తదితరులు ఎస్సై సురేష్‌బాబును దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ చోరీ కేసు చేధించే సమయంలో ప్రజల సహకరించడంతో త్వరతగతిని నిందితులను పట్టుకో గలుగుతున్నామన్నారు. ప్రజలు పోలీసుల సహకారం తీసుకుంటే అసలు చోరీ జరగకుండా చేయవచ్చని తెలిపారు. పట్టణ పరిధిలో సెక్షన్ 30 అమలులో ఉందని ఎవరైనా సభలు, సమావేశాలు నిర్వహించాలనుకుంటే ముందస్తుగా అనుమతులు తీసుకోవాలని తెలిపారు.

పథకాలతో ప్రజల్లో పెరిగిన సంతృప్తి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- జలసిరి వాటర్ ప్లాంట్ ప్రారంభం



జలసిరి వాటర్ ప్లాంట్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు తదితరులు

రాయవరం: ప్రభుత్వం ప్రజా సంక్షేమమే పరమావధిగా చేపడుతున్న కార్యక్రమాలతో ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరిగిందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని చెల్లూరులో ఆదివారం జలసిరి వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల సత్వర పరిష్కారంతో ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నూరు శాతం సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ పథకం ద్వారా కుల, ఆదాయ, వివాహ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కు మొబైల్ నంబరు అనుసంధానం తదితర 11 రకాల సేవలను ఉచితంగా అందజేస్తున్నట్టు తెలిపారు. గ్రామంలో 1,084 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి, ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. గ్రామానికి నాలుగు రామాలయాలు మంజూరు చేసినట్టు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి సమాన స్థాయిలో జరుగుతుందన్నారు. రాబోయే సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పంచాయతీ నిధులు రూ.12లక్షలతో నిర్మించిన జలసిరి భవనం, రూ.3 లక్షలతో సర్వారాయ షుగర్స్ సమకూర్చిన ఆర్వో ప్లాంట్ మిషనరీని ఎమ్మెల్సీ త్రిమూర్తులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలిక రాఘవ, ఉప సర్పంచ్ బుద్దాల రాంబాబు, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చిక్కాల శ్రీరాములు, రాష్ట్ర పోలీస్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి అనంతలక్ష్మి, అగస్త్యేశ్వస్వామి దేవస్థానం చైర్మన్ రిమ్మలపూడి రాంబాబు, వైఎస్సార్ సీపీ నేతలు పలివెల రామకృష్ణ, చోడె వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాలకూ లబ్ధి

- మంత్రి చెల్లుబోయిన వేణు
- దుగ్గుదుర్రులో 'గడప గడపకూ'



దుగ్గుదుర్రులో పథకాలను వివరిస్తున్న మంత్రి వేణు

కాజులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు లబ్ధి చేకూరుతుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంబంధల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. దుగ్గుదుర్రులో ఆదివారం మంత్రి వేణు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వలంటీర్లు, కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరిని పలకరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలనలో అరకొరగా వచ్చే ప్రభుత్వ పథకాలను జన్మభూమి కమిటీ సిఫార్సుల మేరకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకే ఇచ్చేవారన్నారు. అయితే జగనన్న ప్రజాసంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలన్నీ పారదర్శకంగా అమలు చేస్తున్నారన్నారు. దేశంలో ఇలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఒక్క జగన్‌కే దక్కుతుందన్నారు. సగటున ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా రూ.లక్ష నుంచి రూ.మూడు లక్షల వరకూ లబ్ధి చేకూరుతుందన్నారు. రానున్న ఎన్నికలలో ప్రజలు మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకోవడం ద్వారా భవిష్యత్‌లో మరిన్ని పథకాలను పొందగలుగుతారన్నారు. గ్రామస్తులు పలు సమస్యలను మంత్రి వేణుగోపాలకృష్ణ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ బీసీసెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, గ్రామ సర్పంచ్ పోతు వెంకటలక్ష్మి, రామచంద్రపురం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ దంగేటి అరుణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మాత నూకరావు, పోతు శ్రీనివాసు, పార్టీ మండల ప్రధానకార్యదర్శి పోతురాజు బాబూరావు, మండల పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు టేకుమూడి దుర్గారావు, మండల గృహసారథుల కమిటీ చైర్మన్ చింతపల్లి నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వెదురుమూడిలో 'జగనన్న సురక్ష'

కపిలేశ్వరపురం: వెదురుమూడిలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గ్రామంలో పర్యటించనున్నారు. గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంపై సర్వే నిర్వహించామని, వెదురుమూడిలో ఉదయం 9.30కి కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు.

కపిలేశ్వరపురం మండలంలో 5,444 మందికి అమ్మఒడి

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల పరిధిలో 5,444 మందికి అమ్మఒడి పథకం ద్వారా ఆర్థిక సాయం మంజూరైంది. విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు సాయమందుతుంది. వల్లూరులో 279 మందికి, నేలటూరులో 275 మందికి, టేకి–1లో 213, టేకి–2లో 229 మందికి మంజూరైంది. కపిలేశ్వరపురం–01లో 355, కపిలేశ్వరపురం–2లో 310, మాచర 313, వెదురుమూడి 217, కాలేరు 267, వడ్లమూరు 196, పడమర ఖండ్రిక 309, అంగర–01లో 344, అంగర–02లో 397 మందికి అమ్మఒడి మంజూరైంది. తాతపూడి 183, నల్లూరు 191, కోరుమిల్లి–01లో 361, కోరుమిల్లి–02లో 199, వాకతిప్ప 191, అద్దంకివారిలంక 235, కేదారిలంకలో 380 మొత్తం 19 గ్రామాల్లోని 5,444 మంది విద్యార్థులకు అమ్మఒడి మంజూరైనట్టు ఎంఈఓ కె.తాతారావు తెలిపారు.

వైఎస్సార్ పంటల బీమా విడుదల

అనపర్తి: మండలంలోని ఐదు గ్రామాల పరిధిలోని రైతులకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా సొమ్ము విడుదలైనట్టు మండల వ్యవసాయ అధికారి బి.సురేష్‌కుమార్ తెలిపారు. దిగుబడి ఆధారంగా వరి పంటకు గాను మండలంలోని దుప్పలపూడి, అనపర్తి, పెడపర్తి గ్రామాల్లోని 2,489 మంది రైతులకు రూ.72,62,447, వాతావరణ ఆధారిత బీమా కింద ఆరుతడి పంటలకు గాను మండలంలోని మహేంద్రవాడ, కొప్పవరం గ్రామాలకు చెందిన 15 మంది రైతులకు రూ.47,402 బీమా మంజూరైనట్టు తెలిపారు. వీటికి సంబంధించిన జాబితాలను ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ఉంచామని ఏఓ తెలిపారు.

దేవాంగ సంక్షేమ సంఘ కార్యవర్గ సమావేశం

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంకలో కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం ఆదివారం సాయంత్రం జరిగింది. సమావేశానికి సంఘ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వూటుకూరి సుబ్రహ్మణ్యస్వామి అధ్యక్షత వహించారు. ఏటా పదో తరగతిలో 500 పైబడి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహిక బహుమతులు ఇవ్వాలని సమావేశంలో తీర్మానించారు. ఇటీవల మృతి చెందిన సంఘ గౌరవాధ్యక్షుడు బళ్ల వీర నాగ మల్లేశ్వరరావు సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో బళ్ల వెంకటేశ్వరరావు, పుత్సల వరదరాజులు, చింతా శంకర మూర్తి, పిచ్చిక శ్యామ్, బట్టు టాక్సీరామ్, నల్లా సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటా ప్రచారం



కేశవరంలో కరపత్రాలు అందజేస్తున్న బీజేపీ నాయకులు

మండపేట: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం అభివృద్ధి చెందిందని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ అన్నారు. కేశవరంలో పార్టీ మండల అధ్యక్షుడు రాయి వీర్రాజు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గృహ సంపర్క్ కార్యక్రమంలో సత్యనారాయణ, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ చాట్రాతి జానకిరాంబాబు తదితరులు పాల్గొని బీజేపీ సంక్షేమ పాలనపై ఇంటింటా ప్రచారం చేశారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. పార్టీ నాయకులు సంగిశెట్టి శ్రీనివాస్, సాయిరామ్, మద్దుల సుబ్బారావు, వల్లభనేని రవీంద్రబాబు, గొడవర్తి రామచంద్రరావు, నరాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో..

రామచంద్రపురం రూరల్: ప్రధాన మంత్రి తొమ్మిదేళ్ల పాలనపై బీజేపీ నాయకులు ఆదివారం ద్రాక్షారామలో కరపత్రాలు పంచుతూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు, మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ, నాయకులు కొట్టువాడ హరిబాబు, యాండ్ర బుల్లిఅబ్బులు, వెన్నపు ధనరాజు, రమణమూర్తి, అల్లం రామకృష్ణ పలువురు మహిళా నేతలు పాల్గొన్నారు.

కొబ్బరి కార్మికులకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌ని సత్కరిస్తున్న కొబ్బరి ఒలుపు కార్మిక సంఘ ప్రతినిధులు

అల్లవరం: కొబ్బరి పరిశ్రమలో దింపు, ఒలుపు కార్మికుల కోసం ప్రత్యేక బోర్డుని ఏర్పాటుచేయాలని ఏపీ రాష్ట్ర కొబ్బరి దింపు, ఒలుపు కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ని కోరారు. గోడిలోని ఆయని నివాసంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. కొబ్బరి కార్మికులు కాళ్లు, చేతులకు సంబంధించి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, 50 సంవత్సరాలు దాటిన కార్మికులకు ప్రభుత్వం నుంచి పింఛన్ మంజూరు చేయించాలని ఎమ్మెల్సీని వారు కోరారు. దీనిపై సీఎం వైఎస్ జగన్‌తో చర్చించి పరిష్కారానికి ప్రయత్నం చేస్తానని ఇజ్రాయిల్ తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు గుబ్బల శ్రీరామమూర్తి, పీవీఎస్ మూర్తి, మామిడికుదురు, గన్నవరం మండల అధ్యక్షులు గుబ్బల కృష్ణ, లంక నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గురు పౌర్ణమికి ఏర్పాట్లు పూర్తి



రామవరంలో భిక్షాటన చేస్తున్న సాయి దీక్షదారులు

అనపర్తి: గురుపౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని సాయిబాబా ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక బాబానగర్‌లోని ఐఎల్‌టీడీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి నవమి వార్షికోత్సవాలకు అన్ని సిద్ధం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. స్థానిక శేషగిరిరావుపేట, పాతవూరుల్లోని సాయి మందిరాల్లో పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు చేశారు.

స్థానిక కెనాల్ రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయంలో టెలిఫోన్ గురుస్వామి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగనున్నాయి. రామవరంలోని అయ్యప్ప సహిత షిర్డీ సాయి ఆలయంలో సప్తాహం, విశేష హోమాది క్రతువులు ఘనంగా నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా సాయి దీక్షదారులు గ్రామంలో భిక్షాటన చేస్తున్నారు. భిక్షాటన ద్వారా వచ్చిన ద్రవ్యాలను ఈ నెల 4వ తేదీన భారీ ఎత్తున నిర్వహించే అన్నసమారాధన కార్యక్రమంలో వినియోగించనున్నట్టు కార్యక్రమాల పర్యవేక్షకుడు కర్రి వెంకటరెడ్డి తెలిపారు.

మౌలిక సౌకర్యాలు కల్పించాలంటూ వినతి



ఇందిరమ్మ కాలనీవాసులు ఇచ్చిన వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీ అనురాధ

అల్లవరం: దేవగుప్తం పంచాయతీ పరిధిలోని ఎస్సీ, బీసీ నిరుపేదలకు కేటాయించిన ఇందిరమ్మ కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కాలనీవాసులు ఎంపీ చింతా అనురాధకి మొరపెట్టుకున్నారు. ఆదివారం మొగళ్ళమూరులోని ఎంపీ నివాసంలో ఇందిరమ్మ కాలనీ మహిళలు ఎంపీ అనురాధని కలిసి వినతి పత్రం అందజేశారు. కాలనీ ఏర్పాటుచేసి పదిహేనేళ్లు అవుతున్నా రోడ్లు, కరెంట్ స్తంభాలు, తాగునీరు ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌ని కలిసి వినతిపత్రం ఇచ్చినా పరిష్కారం కాలేదని ఎంపీకి వివరించారు. తమ కాలనీలో రోడ్లు, కరెంట్ స్తంభాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దంగేటి శ్రీదేవి, కుడుపూడి మణి, కడలి మంగాలక్ష్మి, బొంతు రాంబాబు, పెచ్చెట్టి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి ట్రైసైకిల్ అందజేత



దివ్యాంగురాలుకి ట్రైసైకిల్‌ని అందజేస్తున్న ఎంపీ అనురాధ

అల్లవరం: ఏపీ విభిన్న ప్రతిభావంతుల మరియు వయోవృద్ధుల సహాయ సంస్థ ద్వారా పంపిణీ చేసిన ట్రైసైకిల్‌ని అంబాజీపేట మండలం గంగలకుర్రు గ్రామానికి చెందిన తరివెట్ల దుర్గభవానికి ఎంపీ చింతా అనురాధ అందజేశారు. మొగళ్ళమూరు ఎంపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన పంపిణీ కార్యక్రమంలో ఎంపీ అనురాధ మాట్లాడుతూ లబ్ధిదారులకు 100 శాతం సబ్సిడీతో ఉచితంగా ట్రైసైకిళ్లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సాపే పార్థసారథి, అడపా శ్రీను, సీతబాబు రాజు, పరమేష్, అంబికా శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఎంపీ కార్యాలయంలో హంసవాహిని ట్రస్టు సేవా కార్యక్రమాల నిమిత్తం బోడే రామప్రసాద్ సమకూర్చిన రూ.50 వేల బ్యాంకు చెక్కుని ట్రస్టు చైర్మన్ బొక్కా సత్యనారాయణకు ఆదివారం అందజేశారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ



బాధితులికు నిత్యావసరాలు అందజేస్తున్న నల్లా పవన్ కుమార్

అమలాపురం రూరల్: మండలంలోని ఎ.వేమవరంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన ఐదు కుటుంబాలకు బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ 100 కేజీల బియ్యం, బకెట్లు, రూ.3,000 ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. బీజేపీ అమలాపురం నియోజకవర్గ కన్వీనర్ అయ్యల భాషా, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి జంగా రాజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, గుడ్‌సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు బియ్యం, నిత్యావసర సరకులు, దుస్తులు, వంట సామగ్రి ఇచ్చారు. కార్యక్రమంలో గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు గంటా లక్ష్మీ ప్రసాద్, కుంచే అర్జున్, పరమట రాజేష్, నేరేడుమిల్లి శ్రీనివాసరావు, పోలినాటి భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్లబళ్ల పోటీలు

రాజానగరం: మండలంలోని చక్రద్వారబంధంలో ఆదివారం ఎడ్లబళ్ల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ముంగర తాతి, గంగారత్నం దంపతుల ఆధ్వర్యంలో వీటిని నిర్వహించారు. మొదటి బహుమతిని సీతారామపురానికి చెందిన నూనె రామసూర్య, రెండో బహుమతిని ముంగరకు చెందిన నాగేశ్వరరావు, మూడో బహుమతిని గాడాలకు చెందిన వేములూరి కాపు ఎడ్లు గెలుచుకున్నాయి.

సూర్యదేవునికి ప్రత్యేక పూజలు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవుని దర్శనానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదానం చేశారు.